సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

- రేపు ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు మాక్ పోలింగ్
- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్
- అనపర్తి నియోజకవర్గంలో 228 పోలింగ్ కేంద్రాలు.
- 2,26,053 మంది ఓటర్లు

అనపర్తి: సార్వత్రిక ఎన్నికల కీలకఘట్టం మొదలైంది. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే సమయం ఆసన్నమైంది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఎన్నికల నిర్వహణతోపాటు ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకునేలా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.మాధురి తెలిపారు. ఎన్నికల సిబ్బంది మొదలుకుని పోలీస్ బందోబస్తు వరకూ అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఏర్పాటు పూర్తయ్యాయి. నియోజకవర్గంలో మొత్తం 21 సెక్టార్ల ద్వారా అధికారులను ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని తరలించేందుకు 70 ప్రైవేటు బస్సులు, పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు వీలుకాని ప్రాంతాల్లో టాటా ఏస్ వాహనాలు వినియోగించనున్నట్టు ఆర్‌ఓ తెలిపారు. దీనికి మండలానికి ఐదు చొప్పున మొత్తం 20 ఏస్ వాహనాలు సిద్ధం చేశామన్నారు. పోలింగ్ సిబ్బందికి పోలింగ్ కేంద్రాల వద్ద ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆమె తెలిపారు.



అనపర్తి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఏర్పాట్లు

నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు

నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో మొత్తం 228 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అనపర్తి మండలంలో 58, బిక్కవోలు మండలంలో 58, పెదపూడి మండలంలో 64 , రంగంపేట మండలంలో 48 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

57 సమస్యాత్మక కేంద్రాలు

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మొత్తం 57 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించినట్టు అధికారులు తెలిపారు. అనపర్తి మండలంలో 17, బిక్కవోలు మండల పరిధిలో 9, పెదపూడి మండలంలో 19, రంగంపేట మండలంలో 12 సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు.

నియోజకవర్గంలోని ఓటర్లు

నియోజకవర్గంలో 2,26,053 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,10,515 మంది ఉండగా మహిళలు 1,15,535, ఇతరులు 3 ఉన్నారు. వీరిలో అనపర్తి మండలంలో 59,886, బిక్కవోలు మండల పరిధిలో 57,684 రంగంపేట మండలంలో 48,182, పెదపూడి మండలంలో 60,301 మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగుల సౌకర్యం కోసం పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు తదితర సౌకర్యాలు కల్పించినట్టు తెలిపారు. వీటితోపాటు పోలింగ్ కేంద్రాల వద్ద వీల్‌చైర్, ఫస్ట్ ఎయిడ్ సౌకర్యాలు కల్పించారు. నియోజకవర్గంలోని 228 పోలింగ్ బూత్‌లు 128 లొకేషన్లలో ఉన్నాయని, ఆయా లొకేషన్లలో ఓటర్ అసిస్టెంట్ బూత్‌ను ఏర్పాటు చేశామని, ఇక్కడ బీఎల్‌ఓలు ఓటర్ స్లిప్‌లకు సంబంధించి ఓటరుకు సహకరించనున్నారు.

పోలింగ్ యంత్రాలు

నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వహించేందుకు గాను సుమారు 1580 మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో నలుగురు అధికారుల చొప్పున పోలింగ్ విధులు నిర్వర్తించనున్నారు. అదేవిధంగా సుమారు 212 మంది రిజర్వులో ఉండనున్నారు. ఇదిలా ఉండగా ఆదివారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాలల పరిధిలోని 228 పోలింగ్ కేంద్రాల ఎన్నికల సిబ్బందికి ఎన్నికల సామగ్రి, ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, కంట్రోల్ యూనిట్ల పంపిణీ చేయనున్నారు. సాంకేతిక పరమైన కారణాలతో పోలింగ్ యంత్రాలు మొరాయిస్తే వాటిని సరి చేసేందుకు గాను ముగ్గురు బెల్ ఇంజినీర్లను ఏర్పాటు చేశారు. వీరు అనపర్తి, పెదపూడి, రంగంపేట మండలాల్లో ఉంటూ పర్యవేక్షిస్తారని ఆర్‌ఓ తెలిపారు. పోలింగ్ కోసం 273 బ్యాలెట్ యూనిట్లు, 273 కంట్రోల్ యూనిట్లు, 296 వివిప్యాట్‌లు సిద్ధంగా ఉంచారు.



మాధురి, అనపర్తి నియోజకవర్గ ఆర్వో

శాంతి భద్రతలపై ప్రత్యేక నిఘా

సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ శివగణేష్ తెలిపారు. పోలింగ్ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద, గ్రామాల్లో తగాదాలు, మద్యం విక్రయాలు, నేరపూరిత ఘటనలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల జరిగేందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

మహిళల కోసం మోడల్ పోలింగ్ స్టేషన్లు



లాలాచెరువులో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ మాధవీలత

రాజానగరం: మహిళా ఓటర్లు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, వారికి ఉపయోగపడేలా నియోజవర్గానికి ఒకటి చొప్పున జిల్లాలో ఏడు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత తెలిపారు. మండలంలోని లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో సాధారణ ఓటర్లు, మహిళల కోసం ఏర్పాటు చేసిన రెండు మోడల్ పోలింగ్ కేంద్రాలను శనివారం ఆమె ప్రారంభించారు. ప్రతి మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేసే మోడల్ పీఎస్ (147)తో పాటు మహిళ కోసం నియోజకవర్గానికి ఒక మోడల్ పీఎస్ (145)ను ఏర్పాటు చేశామన్నారు.

ప్రత్యేక అలంకరణ

లాలాచెరువు హెచ్‌బీ కాలనీలోని జెడ్పీ ఉన్నత పాఠశాల భవనాలలో ఏర్పాటు చేసిన ఈ రెండు పోలింగ్ కేంద్రాల వద్ద లోపల, బయట పండగ వాతావరణాన్ని ప్రతిబింబించేలా సర్వాంగ సుందరంగా అలంకరించారు. ముఖద్వారాలను బెలూన్లతో అలంకరించి, లోపల గులాబీ రంగు కర్టెన్లు, టేబుల్ క్లాత్‌లతో సెట్టింగ్ చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి తాగునీరు, వైద్య సదుపాయాలను కూడా అందుబాటులో ఉంచారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన పీఎస్ 145 పరిధిలో 578 మంది మహిళలు, 527 మంది పురుషులు, అలాగే 147 పీఎస్ పరిధిలో 590 మంది మహిళలు, 518 మంది పురుషులు ఉన్నారని రిటర్నింగ్ అధికారి తెలిపారు.

క్లుప్తంగా

సంక్షేమ సారథి జగన్‌కు మళ్లీ పట్టం కడదాం



మాట్లాడుతున్న ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ వీరన్న

మధురపూడి: సంక్షేమ సారథి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి చేద్దామని ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న అన్నారు. కోరుకొండలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ జాబితాలోని సంచార జాతులు జగన్ అందించిన సంక్షేమ పథకాలతో లబ్ధి పొందాయన్నారు. ఎంబీసీ కార్పొరేషన్‌లోని 32 సంచార జాతుల్లో 4,90,091 మంది లబ్ధిదారులకు రూ.1,288,44,73,138 అందినట్టు తెలిపారు. ఈ ఎన్నికల్లో జగనన్నకు ఓటేసి పేదల ఐక్యతను చాటి చెప్పాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం



కొంకుదురులో మజ్జిగ పంపిణీ చేస్తున్న ఫ్రెండ్స్ యూత్ సభ్యులు

బిక్కవోలు: కొంకుదురులోని మెయిన్ రోడ్డులో ఉన్న రామాలయం వద్ద ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. శనివారం గ్రామానికి చెందిన 42 మంది యువకులు ఈ చలివేంద్రాని నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు, మజ్జిగ, మంచినీరు అందిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు యువకులును అందించారు.

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు

పెదపూడి: రేపు జరిగే ఎన్నికలకు సంబంధించి మండలంలో పకడ్బందీగా కట్టుబందీగా ఎన్నికల ఏర్పాట్లు చేస్తున్నామని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ మండలంలో మొత్తం 64 పోలింగ్ బూత్‌ల ఉన్నాయన్నారు. మండలంలో 60301 ఓటర్లు ఉన్నారని, వారిలో పురుషులు 29,888 మంది, 30,413 మంది మహిళలు ఉన్నారన్నారు. మండలంలో 19 సమస్యాత్మక పోలింగ్ బూత్‌లు ఉన్నాయన్నారు. వాటిలో ఎలాంటి అలర్లు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. అక్కడ జరిగే పోలింగ్ ప్రక్రియను వీడియో ద్వారా రికార్డు చేస్తారన్నారు. మిగిలిన పోలింగ్ బూత్‌ల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేశారన్నారు. ఒక్కో పోలింగ్ బూత్‌లో ఆరుగురు అధికారులు ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తారన్నారు. మండలంలో మొత్తం 384 మంది ఎన్నికల నిర్వహణలో పాల్గొంటారన్నారు.

50 సమస్యాత్మక గ్రామాల గుర్తింపు

రాజానగరం: సార్వత్రిక ఎన్నికలను సోమవారం ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గంలోని 50 గ్రామాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించి, అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాలను 20 రూట్లుగా విభజించారు. 216 పోలింగ్ కేంద్రాలున్న ఈ నియోజకవర్గంలో పోలింగ్ విధుల కోసం 460 మందిని పీఓ, ఏపీఓలుగా, 904 మందిని ఓపీఓలుగా నియమించారు. వీరిని పోలింగ్ కేంద్రాలకు సామగ్రితో పాటు తరలించేందుకు 60 బస్సులను ఏర్పాటు చేశారు. స్టాక్ పాయింట్‌గా ఉన్న ఆదికవి నన్నయ యూనివర్సిటీకి ఇప్పటికే ఈ బస్సులు చేరుకున్నాయి. నియోజకవర్గంలో 2,16,491 ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 1,06,879 మంది, మహిళలు 1,09,606 మంది, ఇతరులు ఆరుగురు ఉన్నారు.

సెబ్ సిబ్బంది దాడులు

మధురపూడి: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) కోరుకొండ సీఐ బంగారురాజు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన దాడుల్లో 100 లీటర్ల సారా, 22 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కోరుకొండ మండలం జంబూపట్నం, దోసకాయలపల్లి, నర్సాపురం, మధురపూడి గ్రామాలకు చెందిన యలుగంటి దుర్గయ్య, గుత్తుల వెంకటేశ్వరరావు, చల్లంగి వెంకటరావు, కడియాల వీరబాబు నివాసాలను తనిఖీ చేసి, వీటిని స్వాధీనం చేసుకున్నారు. దాడులలో ఎస్.వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో మెగా పోస్టర్స్ చెక్

రాజమహేంద్రవరం సిటీ: రైల్వే ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు విజయవాడ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ రాంబాబు తెలిపారు. రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్‌లో శనివారం మెగా పోస్టర్స్ చెక్ నిర్వహించారు. ఈ సందర్భంగా 604 కేసులు నమోదు చేసి, రూ.3.64 లక్షలను జరిమానాలు విధించారు. 28 రైళ్లలో తనిఖీలు నిర్వహించి టికెట్ లేని ప్రయాణికులు, నిబంధనలను అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీలలో 45 మంది ట్రైన్ టికెట్ చెకింగ్ అధికారులు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటేయండి

- మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: గడచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం చూసి వైఎస్సార్ సీపీకి ఓటేయాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. ఆయన శనివారం మండలంలోని ముగ్గళ్ల, ఇనుగంటివారిపేటలలో ఆయా గ్రామాల పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పాలనలో రాష్ట్రంలో ప్రజలందరికీ లబ్ధి చేకూరిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేశానన్నారు. రాజమహేంద్రవరం – సీతానగరం రోడ్డును నాలుగు లేన్ల రోడ్డుగా తీర్చిదిద్దామన్నారు. సీతానగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేసి 36 పడకల ఆసుపత్రిని రూ.8 కోట్లతో రఘుదేవపురంలో నెలకొల్పుతున్నామన్నారు. బొబ్బిల్లంకలో పీహెచ్‌సీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. బొబ్బిల్లంకలోని తొర్రిగడ్డ కాలువపై రివర్స్ పంపింగ్ స్కీమ్‌ను నెలకొల్పుతున్నామన్నారు. నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలను సైతం అభివృద్ధి చేశామన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, రైతులకు సాగునీరు, ఇళ్లకు తాగునీరు అందించామన్నారు. నియోజకవర్గంలో రూ.1,773 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు, రూ.1,377 కోట్లతో సంక్షేమ పథకాలు అందించడం జరిగిందన్నారు. అలాగే నియోజకవర్గంలో 20,178 మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందించినట్టు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, డాక్టర్ శ్రీనివాస్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ -2 సత్యం మదన్‌బాబు, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, సర్పంచ్ సత్యం రాంపండు, ఆళ్ల కోటేశ్వరరావు, బొమ్ముల రాంబాబు, సాదే చంటిబాబు, సుంకవల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



ముగ్గళ్లలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కూటమితో బహుజనులకు ఒరిగేదేమీ లేదు

మధురపూడి: ఎన్డీయే కూటమి మేనిఫెస్టోతో బహుజనులకు మేలు జరగదని, అతి మనువాద బీజేపీని గద్దె దింపడమే లక్ష్యంగా బీఎస్పీకి ఏనుగు గుర్తుపై ఓటేయాలని బహుజన సమాజ్ పార్టీ నాయకుడు ఇసుకపట్ల రాంబాబు ఓటర్లను అభ్యర్థించారు. గాడాల పొన్నాలమ్మ ఆలయం సమీపంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్డీయే ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు తీరని అన్యాయం చేసిందన్నారు. రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో తమ పార్టీ పోటీలో ఉందన్నారు. ఎంపీ అభ్యర్థిగా పరమటి గణేశ్వరరావు, ఎమ్మెల్యే అభ్యర్థిగా యల్లమిల్లి రవికుమార్ పోటీ చేస్తున్నట్టు తెలిపారు.

వైఎస్సార్ సీపీని మళ్లీ ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి
- గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

రంగంపేట: అభివృద్ధి, సంక్షేమం అందాలంటే రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ పాలన ఉండాలని, ప్రజలందరూ మళ్లీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని బాలవరం, దొంతమూరు, ఈలకొలను, ముకుందవరం, వడిశలేరు, దొడ్డిగుంట, సింగంపల్లి గ్రామాల్లోని ఉపాధిహామీ కూలీలను కలుసుకుని వచ్చే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తులకు ఓటేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో జరగని సంక్షేమం ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతుందన్నారు. కులమతాలకు, రాజకీయాలకు తావులేకుండా ప్రతీ ఒక్కరికీ సంక్షేమం అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మీ అందరికీ మంచి జరిగి ఉంటేనే వైఎస్సార్‌సీపీకి ఓటేయ్యాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలందరికీ అందుతున్నాయనీ కూలీలు ఆనందం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా ఉంటామని వారు తమ మద్దతును తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, జెడ్పీకో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



దొంతమూరులో ఉపాధి కూలీల మద్దతు కోరుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

మార్పును గమనించండి.. వైఎస్సార్ సీపీకి ఓటు వేయండి

అనపర్తి: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండు కళ్లుగా చేసుకుని ఐదేళ్లుగా రాష్ట్రంలో సుపరిపాలన అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌ను ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిపారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాణరెడ్డి అన్నారు. శనివారం స్థానిక మెయిన్ రోడ్డులో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల రూపురేఖలు మారాయని అన్నారు. వివిధ సంక్షేమ పథకాల అమలుతో అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా నిలిచిందని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన మార్పును గమనించి ఓటు వేయాని అన్నారు. స్థానిక కెనాల్ రోడ్డు, మెయిన్ రోడ్డులో ప్రతి దుకాణం వద్దకు వెళ్లిన ఆయన వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఈ నెల 13 జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా గూడూరి శ్రీనివాస్‌లకు మద్దతుగా నిలిచి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే తనయుడు, ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ గౌతమ్‌రెడ్డి ఈ ప్రచారంలో పాల్గొని తండ్రికి మద్దతుగా ప్రచారం చేశారు. వర్తక సంఘం అధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి, రాష్ట్ర రెడ్డి, భట్రాజుల కార్పొరేషన్ డైరక్టర్లు సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, ఏఎంసీ డైరక్టర్ కోనాల సత్యనారాయణరెడ్డి, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.



అనపర్తి మెయిన్ రోడ్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

జగన్‌తోనే బీసీల అభివృద్ధి



పుట్టకొండలో ప్రచారం చేస్తున్న బీసీ ప్రతినిధులు

పెదపూడి: బీసీల అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌తోనే సాధ్యమైందని, రేపు జరిగే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా బీసీలంతా ఓటు ముఖ్యమంత్రిగా జగనన్నను గెలిపించుకుందామని బీసీ ప్రతినిధులు తెలిపారు. మండలంలో పుట్టకొండ, కాండ్రేగుల గ్రామాల్లో బీసీ సంఘాల ప్రతినిధులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించి, ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా, ఎంపీగా గూడురు శ్రీనివాసును అత్యంత భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో పుట్టకొండ, కాండ్రేగుల సర్పంచులు వల్లు వెంకటరమణ, కె.వి.వి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వాసంశెట్టి మాధవ, పార్టీ నాయకులు పంపన రమణ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని గెలిపించండి

బిక్కవోలు: ప్రజల ఆకాంక్షలు తీర్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించాలని నియోజకవర్గం ప్రచారం కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజి అన్నారు. శనివారం బలభద్రపురం గ్రామంలోని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల మధ్యనే ఉంటూ ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశారన్నారు. మరోమారు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి ఆదరించాలన్నారు. జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ సంతకాలు అందరికీ చేరాయని ఎన్నికల్లో గెలిపిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. నేటి ఎన్నికల ప్రచారం ముగిస్తుందని కార్యకర్తలు ప్రతి ఓటర్లను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేస్తేలాగే చూడాలని ఆయన అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోని వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, మాజీ ఏఎంసీ నాయకులు గురునాగు, నాళం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బలభద్రపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ

గణిత సిలబస్ నిర్ధారణ సమావేశం

కంబాలచెరువు: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో 2024 – 25 విద్యా సంవత్సరానికి అండర్ గ్రాడ్యుయేట్ విభాగంలో గణితశాస్త్రం సిలబస్‌ను నిర్ధారించేందుకు బోర్డు ఆఫ్ స్టడీస్ మీటింగ్ శనివారం జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే ఆదేశాల మేరకు గణితశాస్త్ర విభాగాధిపతి గోకవరపు చంద్రశేఖర్ ఈ సమావేశం చైర్మన్‌గా వ్యవహరించారు. పిఠాపురం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి యూనివర్సిటీ నామినీగా ఉన్నారు. అమెరికాలో సేల్స్ ఫోర్స్ కంపెనీ ప్రొడక్ట్ సెక్యూరిటీ లీడ్‌గా పని చేస్తున్న గొల్లపూడి రవిశంకర్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లాలోని పలు కళాశాలల ప్రిన్సిపాళ్లు, గణిత శాస్త్ర అధ్యాపకులు పాల్గొని పలు సూచనలు చేశారు.